# ఆహుతి



జి.సుబ్బారావు

ఆ పది రోజుల్లోనే మాధవుడూ, బ్రహ్మం, ప్రాణస్నేహితు లెట్లా అయారో ఆశ్చర్యం. అంతకుముందు వాళ్ల యిద్దరికీ పరిచయం లేదు. కాలేజీ చదువు సాగించడానికి కాకినాడ వచ్చేరు, వేరువేరు గ్రామాలనుండి. మొట్టమొదటిసారిగా బ్రహ్మానికి కాఫీహోటల్లో మాధవుడుతో పరిచయం కలిగింది. అంతే. వెంటనే వాళ్ళిద్దరూ రూమ్ మేట్సుగా వుండడానికి తీర్మానించుకున్నారు. దానికేమీ అడ్డంకులులేకుండా ప్రేజరుపేటలో గది అద్దెకి తీసుకున్నారు.

అసలు మాధవుడు హోస్టలులో వుందామనుకున్నాడు. కాని బ్రహ్మం పట్టుమీద తను కూడా బయట వుండవలసి వచ్చింది. ఇంత స్నేహితులయినా బ్రహ్మం కులంగాని, ఆర్థికస్థితిగాని మాధవుడికి తెలియవు.

మాధవుడు హైస్కూల్లో ప్రప్రథమం నుండి రామంతో కలిసి చదువుకున్నాడు. అప్పుడు వాళ్ళిద్దరూ చాలా స్నేహంగా తిరుగుతూవుండే వాళ్ళు. మాధవుడు కొద్దిగా వున్నవా డవడంవల్ల రామం కూడా అతనితో కలిసి తరుచు సినిమాలకు, కాఫీహొటళ్ళకు వెళుతుండేవాడు.

రామం కాలేజీలో చేరడానికి కాలేజీ భవనం చేరుకున్నాడు, అలస్యంగా చేరుతున్నందుకు విచారిస్తూ. పుస్తకాలతో మాధవుడు కాలేజీకి వస్తూ వుండడం చూసి బ్రహ్మానందభరితు డయ్యాడు రామం. అప్పటివరకూ తనను కొత్తగా తోచిన వూరూ, కాలేజీ—రెండూ పాతబడి పోయేయి.

కాలేజీ నిర్ణీతకాలం పూర్తయిన వెంటనే మాధవుడు రామాన్ని తనగదికి తీసికొని వెళ్లేడు. బ్రహ్మాన్ని రామానికి పరిచయం చేసేడు మాధవుడు. రామానికి ఎంతో కోపంవచ్చింది, బ్రహ్మం మీద-తన స్థానంలో బ్రహ్మం కుదురుకున్నాడని మండిపోయింది మనస్సు. 'నా హైస్కూలు జీవితంలో మాధవుడువల్ల ఎంతో సహాయం పొందేను-అంతకంటె ఎక్కువగా కాలేజీ జీవితంలో బ్రహ్మం మాధవుడిద్వారా ఫలితాన్ని పొందుతాడు' అని యీర్ష్య పడ్డాడు.

ఇక మాధవుడు ఎంతగా బ్రతిమాలినా ఆగదిలో వుండడానికి యిష్టపడలేదు రామం. ఏదో సాకు చెప్పి తప్పించుకున్నాడు.

ప్రతిచోటా మాధవుడూ, బ్రహ్మం జంటగా తిరుగుతూండడం రామం చాలాసార్లు గమనించేడు. సినిమాలోను, కాఫీ హోటళ్ళలోను వాళ్ళిద్దర్నీ చూసి ఏవగించుకున్న రోజులు ఎన్నో గడిచేయి, రామం కాలేజీ జీవితంలో. ఇక ముం దెప్పుడూ తను మాధవుడి స్నేహితుడిగా వుండలేనని నిర్ధారణ చేసికొన్నాడు. బ్రహ్మం, మాధవుడు కలిసి ప్రతిసారి క్లాసులో రామాన్ని పలకరిస్తూవుండేవారు. కానితను ముభావంగా మసిలేవాడు. ఒకవేపు బ్రహ్మంలో తప్పులకై వెదుక నారంభించేడు రామం. దాని ఫలితంగా బ్రహ్మం చాలా బీదవాడని తెలిసినప్పుడు రామానికి బ్రహ్మంమీద మరింతకోపం రావడమే కాక, మాధవుడిమీద జాలి కలిగింది. ఈ సాకుతో బ్రహ్మాన్ని మాధవుడినుండి విడదీయడమే కర్తవ్యముగా నిర్ణయించాడు రామం.

ఆ రోజు ఆదివారం — కాలేజీ సెలవ దినం. ఉదయాన్నే రామం కాఫీ సేవించి మాధవుడి గదికి ప్రయాణమయాడు. గది గుమ్మం ముందు వసారాలో అడుగుపెట్టేసరికి లోపలినుండి మాటలు వినిపించసాగేయి. అవి పూర్తయ్యేక గదిలో ప్రవేశించి పనిపూర్తి చేద్దామని అక్కడే నిలుచుని పోయేడు.

మాధవుడి వీపు తట్టుతూ ' బ్రదర్, రేపే మావూరు పోవడానికి నిశ్చయించుకున్నాను ' అన్న బ్రహ్మంమాటలు మాధవుడినిఆశ్చర్యచకితుణ్ణిచేసేయి.

' రేపు వెళ్లడ మెందుకు, రేపు కాలేజీవుంది, బ్రహ్మం ' అన్న ముక్కలు వాటంతటవే మాధవుడి నుండి వూడిపడ్డాయి.

'చదువుకు స్వస్తి చెప్పిపోయేవాడికి కాలేజీ సెలవ వుంటేనేమి, లేకపోతేనేమి ' అంటూ మాధవుడి పుస్తకాలవేపు దీనంగా చూసేడు బ్రహ్మం.

' దీనికోరకేనా నువ్వు కాలేజీలో చేరిన నాటి నుండి శ్రద్ధగా చదవడం మొదలు పెట్టింది ? ' అని ప్రశ్నించేడు మాధవుడు నవ్వుతూ.

' నేనొకటి తలిస్తే దేవుడొకటి తలిచేడు ' అని మాత్రమే సమాధాన మీయ గలిగేడు బ్రహ్మం. 'నీ ధోరణి నాకేమీ అర్థం కావటంలేదు' అన్నాడు మాధవుడు. 'నువ్వు ప్రతివిషయానికీ నవ్వుతావు—అందుచేతే నీతో ఏవిషయంచెప్పడానికీ జంకుతాను' అనితనవుద్దేశాన్ని వెళ్ళబుచ్చాడువిచారసూచకంగా.

'అయితే నువ్వు నిజంగా చదువు మానివేయడానికి కారణం తెలుసుకోవచ్చునా' అని తన స్నేహితుని ముఖంలో ముఖంపెట్టి అడిగేడు మాధవుడు.

' దీనికి కారణం నా కుటుంబ పరిస్థితులే. పూర్తిగా వింటానంటే చెప్పుతా' నని మాధవుడి వేపు జాలిగా చూసేడు.

వెంటనే అంగీకారాన్ని తెలుపుతూ మాధవుడు బుర్రవూపేడు.

'నా తండ్రి మొదట్లో అంతగొప్పవాడు కాక పోయినా, ప్రస్తుతం ఆయనంత బీదవాడు మాత్రం కాడు. ఆశకొద్దీ తన తలకు మించిన వ్యాపారం చేయబోయేడు. అదే మాకొంపతీసింది. నీవల్లే నాడబ్బంతా పోయింది. నీ మొహానికి అదృష్టం లేదు, అంటూ ఎల్లప్పుడూ మాతల్లిమీద రుసరుసలాడుతోండేవాడు మానాన్న. అభిమానం గల మాఅమ్మ యీ ఆరోపణకు కుమిలి, కృశించి పోయింది. నాకంటే చిన్నవాళ్లు యిద్దరు పిల్లలు వున్నారు—వారి గతి ఏమవుతుందో ! నా తల్లి మరణానికి చాల దగ్గరస్థితిలో వుందనీ, మందుల కోసమే డబ్బు ఖర్చుపెట్టలేని స్థితిలో వున్నాను, నువ్వు వెంటనే రాకతప్పదని వుత్తరం వచ్చింది మామయ్య దగ్గరనుండి. నీతో నా పరిస్థితులు ఎప్పటినుంచో చెప్పుదామనుకునేవాడిని--కాని మన మెన్ని కష్టాలుపడుతున్నా సరే వాటిని మరుగు పరిచి మిత్రులకానందంగా వుండేలా సంచరించాలి అనే నీమాటలు చాలా వరకు అంతరాయం కలిగించేయి' మథనపడుతు పూర్తిచేయగలిగేడు బ్రహ్మం.

మాధవుడు కన్నీరు రాల్చాడు. 'నేనూ చూస్తూ ఏమీ సహాయం చేయలేకపోతున్నానే' అన్న నిరాశ ముఖాన్ని పూర్తిగా ఆవరించింది.

అప్పటివరకూ రామం బయట అలానే నుంచొని పోయేడు. 'అన్యాయంగా నేటివరకు బ్రహ్మాన్ని ఎందుకు ద్వేషించేను' అని పశ్చాత్తాపపడ్డాడు. బ్రహ్మం కుటుంబపరిస్థితి ఏ వ్యక్తినైనా కలిచివేస్తుంది-ఎంతమంది విద్యార్థులు వారి జీవితాల్ని దుఃఖమయంగా గడుపుతున్నారో అని గొణుక్కుంటూ తనగదికి దారి తీసేడు రామం.

నేటికీ బ్రహ్మంనుండి మాధవుడికి వుత్తరాలు వస్తూవుంటాయి. మాధవుడు చదివి వినిపిస్తూ వుంటాడు బరువుగా. సిగ్గుతో తల వంచుకొంటాడు రామం. బ్రహ్మం వుత్తరాల్లో ఏ శక్తివుందో! చదువుకుందికికూడా నోచుకోనివ్వని దారిద్ర్యశక్తి.


# ది ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

హెడ్డాఫీసు : మదరాసు

(Estd:  1907)

జారీచేసి చందావేయబడిన

| | |
|---|---|
| మూలధనం | రూ. 72,00,000 |
| అడిగిన మూలధనము. | రూ. 53,00,000 |
| రిజర్వ్ ఫండ్ | రూ. 62,00,000 |

అన్నిరకాల బ్యాంకింగ్ వ్యవహారాలు చేయబడును.

యన్. గోపాల అయ్యర్,
కార్యదర్శి.